# నోయిడాలోని స్మార్ట్‌ఫోన్ తయారీ విభాగాల్లో ఆందోళన

**స్మార్ట్‌ఫోన్‌లు** తయారీచేసే 35 పరిశ్రమలు కేంద్రీకృతమైవున్న నోయిడా, దేశంలో సెల్‌ఫోన్ల తయారీకి ఒక ముఖ్యమైన కేంద్రంగా వుంది. దేశంలో సంవత్సరానికి 45 కోట్ల స్మార్ట్‌ఫోన్లకు గిరాకీ వుండగా, కేవలం నోయిడా ప్రాంతంలోని తయారీ యూనిట్లు మాత్రమే 20 కోట్ల సెల్‌ఫోన్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి వున్నాయి.

మనదేశంలోని మార్కెట్లలో ఈ సెల్‌ఫోన్ల అమ్మకాలద్వారా ఆయా సెల్‌ఫోన్ తయారీ కంపెనీలు భారీలాభాలు గడిస్తున్నాయి. అయితే ఈ సెల్‌ఫోన్ తయారీ కంపెనీలలో పనిచేసే కార్మికుల స్థితిగతులు చాలా దయనీయంగా, దుర్భరంగా వున్నాయి. వేతనాలపెంపు, సరైన పనిపరిస్థితులు మరియు మెరుగైన పనిగంటలు తదితర తమ న్యాయమైన డిమాండ్లపై ఈ కంపెనీలలో పనిచేసే కార్మికులు గత రెండు సం॥లలో అనేక ఆందోళనలు చేశారు. అయితే ఈ సెల్‌ఫోన్ తయారీ సంస్థల యాజమాన్యాలు, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించు కోకుండా, వారు ఆందోళన మార్గం చేపట్టక తప్పనిస్థితి కల్పిస్తున్నారు.

గత సం॥రం నవంబర్‌లో దీపావళి తర్వాత మొబైల్‌ఫోన్లకు గిరాకీ తగ్గిందనే కారణంతో యాజమాన్యం 200 మంది కార్మికులను విధులనుండి తొలగించిన దానిపై 'హైపాడ్ టెక్నాలజీ' కంపెనీ కార్మికులు నవంబర్ 30న తీవ్ర ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు.

హైపాడ్ టెక్నాలజీ సంస్థ తయారుచేసే ఒప్పో మొబైల్‌ఫోన్లను, పవర్ బ్యాంకులను ప్రసిద్ధిగాంచిన గ్జియామి సంస్థ మార్కెట్ చేస్తోంది. 2018 జులై నుండి సెప్టెంబర్ నెలల మధ్య మూడునెలల కాలవ్యవధిలోనే ఒప్పో 30 లక్షల ఫోన్లను అమ్మకం చేసింది. ఒప్పో తన నూతన బ్రాండ్‌ను మే 1న ప్రారంభించి, సెప్టెంబర్ నాటికి 10 లక్షల ఫోన్లను అమ్మింది. ఈ అమ్మకాలతో అధికలాభాలు గడించిన తర్వాత, గిరాకీ తగ్గిందనే సాకుతో 200 మంది కార్మికులను హైపాడ్ టెక్నాలజీ కంపెనీ తొలగించివేసింది.

ఈవిధంగా కార్మికులు నిరసనాందోళనలు చేపట్టటం ఇది మొదటి సారేమీ కాదు; యాజ మాన్యాల కార్మిక వ్యతిరేక, నిరంకుశ వైఖరులు, విధానాలే కార్మికులను ఆందోళనోద్యమాలకు నెడుతున్నాయి. ఒప్పో మొబైల్ కంపెనీ కార్మికులు ఈవిధంగా నిరసనలకు దిగుతారని తెలిసి కూడా, కార్మికుల ప్రయోజనాల గురించి ఏమాత్రం ఆలోచించటానికి కూడా సంసిద్ధం కాని, యాజమాన్యం, తన సూపర్ లాభార్జనల పైనే దృష్టి సారించింది. కార్మిక చట్టాలుగానీ, ప్రభుత్వ యంత్రాంగంగానీ కార్మికుల ప్రయోజనా లను, హక్కులను పరిరక్షించలేకపోగా, శాంతి భద్రతలను కాపాడే పేరున తప్పుడు విధానాల నుసరిస్తున్న పారిశ్రామిక యాజమాన్యాల పక్షం వహిస్తున్నాయి.

'వివో ఇండియా' ఆధ్వర్యంలోని ఓ స్మార్ట్ ఫోన్ల తయారీ విభాగంలో, గత సం॥ జులైలో కార్మికుల నిరసనాందోళనలు 'హింసాత్మక' రూపం తీసుకున్నాయి. ఉత్పాదకతను మెరుగు చేసే పేరిట 50 మంది కార్మికులను అర్థాంతరంగా పనులనుండి తొలగించినపుడు ఈ పరిస్థితి సంభవించింది.

గ్రేటర్ నోయిడాలోని ఎల్‌జి ఇండియా ప్రధాన కంపెనీలలో ఒకటైన గృహోపకరణాల తయారీ పరిశ్రమలో 2016 జులైలో ఓ నిరసనాందోళన బ్రద్దలైంది. మెరుగైన వేతనాలను, పనిభారం తగ్గింపును డిమాండ్ చేస్తూ మొదలైన ఈ ఆందోళన నాలుగు నెలలకాలం సాగింది.

2016 మార్చిలోనే నోయిడాలోని ఒప్పో మొబైల్‌ఫోన్ల తయారీ కంపెనీలోని కార్మికులు కంపెనీని దిగ్బంధం చేశారు. చైనాకు చెందిన కంపెనీ కార్యనిర్వహణాధికారి ఒకరు భారత జాతీయపతాకాన్ని చించేశారనే వార్తలతో కార్మికులు కోపోద్రిక్తులయ్యారు.

2018 ఏప్రిల్‌లో హైపాడ్ టెక్నాలజీ కంపెనీని కార్మికులు మరియు స్థానిక ప్రజలు దిగ్బంధించి గాజు అద్దాలను, కిటికీలను, సిసి టి.వి. కెమేరాలను ధ్వంసం చేశారు. మెరుగైన వేతనాలను, పనిభారం తగ్గింపును వారు డిమాండ్ చేశారు. అయినప్పటికీ వారి డిమాండ్స్‌ను యజమానులు పెడచెవినబెట్టారు.

నోయిడాలోని మొబైల్‌ఫోన్ల తయారీ కంపెనీల యాజమాన్యం ఎక్కువగా శిక్షకులుగా వుండేవారినుపయోగించి కార్మికుల పనిని చేయించే వ్యూహంతో సాగుతున్నారు. ఈ శిక్షకులకు కనీసంగా కూడా కార్మిక చట్టాలను అమలుచేయాల్సిన అవసరం లేదు. అందువలన చట్టభీతి లేకుండా వారిని దుర్మార్గంగా దోచుకునే వీలు వుంటుంది. ఈ వ్యూహంతో మొబైల్‌ఫోన్ల తయారీదారులు తమ ఉత్పత్తుల సంఖ్యను గణనీయంగా, వేగంగా పెంచుకోగలుగుతున్నారు. తాము ఈ దేశంలో పెట్టిన భారీ పెట్టుబడుల అవసరాలను అందుకునేవిధంగా నిలకడగా సాగే నమూనాగా తమ సెల్‌ఫోన్ తయారీ పరిశ్రమలను నడుపగలుగుతున్నామంటూ, ఈ కంపెనీల యాజమాన్యం తమ కార్మిక వ్యతిరేక విధానాలను సమర్ధించుకుంటోంది.

మరోవైపున మనదేశ పాలకులు, ప్రభుత్వాలు మనదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి భారీగా తరలి రావటానికి, ఉత్పత్తులు సాగించుకోవటానికి ఎలాంటి ఆటంకంలేని వాతావరణం కల్పించటానికి తాము సంసిద్ధులుగా వున్నామని, పదేపదే ప్రకటిస్తూ వస్తున్నారు కూడా.

బడా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అనుకూలమైన ఈ విధానాలు మనదేశంలో కార్మికులకు, కార్మికవర్గానికి ఓ పెద్ద గుదిబండగా వున్నాయి. ఈ విధానాల ఫలితంగా దేశంలోని కార్మికుల, శ్రామికుల జీవన, పనిపరిస్థితులు నానాటికీ దిగజారుతూ వారికి ఎలాంటి ఆశా కానరాకుంది.

కార్మికుల ఇంతటి దుస్థితికి కారకులైన పారిశ్రామిక యాజమాన్యాలే, కార్మికులపై నెపం మోపుతూ, కార్మికుల్నే అశాంతికి కారకులుగా, పారిశ్రామిక శాంతికి భంగం కలిగించేవారిగా చూపుతూ గుండెలు బాదుకుంటున్నారు. అంతేగాక, కార్మికులు సృష్టించే ఈ అశాంతి కారణంగానే భారతదేశానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అవకాశాలు తుడిచిపెట్టబడతాయని వాపోతున్నారు. ఈవిధంగా బాధితులైన కార్మికులను, వారి శ్రమశక్తిని మొరటుగా, అమానవీయంగా దోపిడీ చేయటంతోపాటు, ప్రభుత్వ ఆగ్రహానికి, నిరంకుశ అణచివేతకు బలిపశువుల్ని చేస్తున్నారు.

భారతదేశంలోని బడా పెట్టుబడిదారీ వర్గపు హేయమైన ఈ విధానాలకు వ్యతిరేకంగా, దేశంలోని కార్మికోద్యమం గట్టిగా పోరాటం సాగించాలి. అసంఘటిత, అనియత విభాగాల లోని కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకోసం చిత్తశుద్ధిగా నిలబడాలి.

ooo